చేస్తాడాయన. చుట్టాలు, స్నేహితులు ఇంకెవరు లేరా!?'' రేవతిలో అసహనం.

మోహన్ వ్యక్తిగత వివరాలు అంతగా తెలియవు నాకు. గతంలో ఇలాంటి అవసరాలలో వాళ్లింటికో, ఆసుపత్రికో ఎన్నిసార్లు వెళ్లినా.. మరో మనిషి తారసపడలేదు. అమెరికాలో ఉద్యోగం దొరికాక అక్కడే పెళ్లి చేసుకున్నాడు మోహన్. మొబైల్‌లో శుభలేఖ పంపించాడు. పెళ్లి చూడటం కోసం 'ఆన్‌లైన్ లింకు' పంపించాడు. ల్యాప్‌టాప్‌లో మోహన్ పెళ్లి చూసి.. స్క్రీన్ మీదే అక్షింతలు వేశాం నేనూ, రేవతి. అప్పుడప్పుడూ ఆన్‌లైన్‌లోనే పలకరిస్తుంటాడు.

ఇంట్లోంచి త్వరగానే బయల్దేరాం. బైక్ మీద వెళ్తున్నంతసేపూ.. రేవతి చికాకు పడుతోనే ఉంది. మా అవసరాల కోసం ఆదివారాలు, పర్మిషన్లు వాడుకోవడమే తప్ప.. ఇలా ప్రత్యేకంగా సెలవులు పెట్టడం తక్కువ.

ఎవరూ చూసేవాళ్లు లేక, పిల్లల చిన్నతనాలలో ఇద్దరం విపరీతంగా సెలవులు వాడేశాం. చాలా సందర్భాలలో జీతాల్లో నష్టంకూడా భరించాల్సి వచ్చింది.

ఎప్పుడో రిటైర్ అయ్యాక వచ్చేడబ్బుల కన్నా.. ఇప్పుడు కళ్లముందున్న అవసరాలు చాలా ముఖ్యం అనుకుని బాధపడలేదు. అయితే ఈమధ్య మోహన్ కోసం చాలా సెలవులు పెడుతున్నాను. ఆలోచనల్లో ఉండగానే రేవతిని ఆఫీసు దగ్గర దిగబెట్టాను.

''బైట నుండి వచ్చీరాగానే ఆ గుడ్డలతో ఇల్లంతా తిరిగేయకండి. మెట్లకింద స్నానం చేసి బట్టలు మార్చుకుని ఇంట్లోకి వెళ్లండి. సాయంత్రం ఏదో తంటాలు పడి నేనే వచ్చేస్తాను'' హెచ్చరికలు చేసి ఆఫీసులోకి వెళ్లిపోయింది రేవతి.

ఆలస్యం చేయకుండా ఆసుపత్రికి పరిగెత్తాను. దార్లో ఉండగానే మోహన్ మళ్లీ ఫోన్ చేశాడు. వీలైతే తన




'నమస్తే తెలంగాణ, ముల్కనూరు సాహితీపీఠం' సంయుక్తంగా నిర్వహించిన 'కథల పోటీ-2023/24'లో రూ.3 వేల బహుమతి పొందిన కథ.

తల్లిని వీడియో కాల్‌లో చూపించమన్నాడు.

ఐసీయూ ముందు వరండాలో దిగాలుగా కూర్చుని ఉన్నారు మోహన్ తండ్రి సుందర్రావుగారు.

''అంకుల్..'' అంటూ ఆయన భుజమ్మీద చెయ్యేశాను.

''సూర్యం.. క్షమించు బాబు! నేనే సాయం కోసం రమ్మన్నాను..'' నా రెండు చేతులూ పట్టుకున్నారాయన.

''పెద్దవారు.. మీరు ఆ మాటనకండి. మోహన్ ఎంతో, నేనూ అంతే'' అంటూ ఆయన పక్కనే కూర్చున్నాను.

''ఆ చనువుతోనే ప్రతీసారీ నా కోసమో, నా భార్య లక్ష్మి కోసమో నిన్ను ఇబ్బంది పెడుతున్నాను. బాబూ సూర్యం.. ఇంతక్రితమే డాక్టర్‌గారు చూసి వెళ్లారు. ముఖ్యమైన వాళ్లని పిల్చుకోమని చెప్పారు. కనీసం పిల్లలకైనా కడసారి చూపు దక్కుతుందో లేదో? ఈసారి లక్ష్మి నాకు అన్యాయం చేసేట్టుగా ఉంది.. బాబు..'' అంటూ కన్నీటి పర్యంతమయ్యారు. మనిషి మొత్తంగా వణికిపోతున్నారు.

ఆయన్ని ఓదార్చడానికి నాకు శక్తి చాలటం లేదు.

''లక్ష్మిగారి అటెండర్ రావాలండి..'' ఐసీయూ ముందున్న సెక్యూరిటీ అరిచాడు.

ఒక్కసారిగా సుందర్రావుగారు కంపించిపోయారు. కూర్చున్నచోటు నుంచి లేవలేకపోతున్నారు.

''సూర్యం.. నాకు ధైర్యంలేదు! ఒక్కసారి నువ్వు..'' అంటూ ఆగిపోయారు.

నేను తడబడుతూ భయంగానే వెళ్లాను. అచేతనంగా పడి ఉన్నారు ఆంటీ. చాలారోజుల క్రితం సుందర్రావుగారికి బాగోలేనప్పుడు ఆవిడకి సాయంగా ఉన్నాను. అదే పరిచయం.

''మీరు..'' డాక్టర్ అడిగారు.

''నా పేరు సూర్యం.. ఆవిడ మా ఆంటీ..'' ఆవిడనే చూస్తున్నాను.

''వీళ్లబ్బాయి మోహన్ చాలాసేపు మాట్లాడాడు నాతో'' అంటూ వైద్య పరిభాషలో మిగతా విషయాలు చెప్పాడు డాక్టర్.

''మాలోపం లేకుండా అన్ని విధాలా ప్రయత్నించాం.. మీ అంకుల్‌కి చెప్పండి. వెంటిలేటర్ విషయంలో ఆయన ఎలా చెబితే అలా..'' చెప్పడం పూర్తయినట్టు వెళ్లిపోయాడు డాక్టర్.

ఈ విషయం పెద్దాయనకి ఎలా చెప్పాలో తెలియడం లేదు.

యాంత్రిక శ్వాస ద్వారా, నిశ్చలంగా ఉన్న ఆంటీని చూస్తున్నాను. మరికొన్ని ఘడియలలో జీవన చరమాంకపు ఘట్టంలోకి శాశ్వతంగా చేరబోతున్నారు. కోరికలు, కలలు, ఆశలు, ఆశయాలు, కష్టాలు, ఇష్టాలు, తీరినవి, విఫలమైనవి, అనుభవాలు, ఆవేదనలు.. ఇలా ఎంతో జీవితాన్ని చూసిన ఆవిడని అలా చూస్తుంటే.. ఎందుకో ఒళ్లు జలదరించింది. చిత్రమైన అనుభవం.. అసలు నేనెవరు? ఆవిడెవరు? ఈ సమయంలో ఇక్కడ నేనుండటం నిజంగా అనూహ్యం.

కేవలం మోహన్ అర్థించడం వల్ల నేనిక్కడ ఉన్నాను అంటే.. నమ్మశక్యం కావడం లేదు. అంతకుమించిన మరేదో బంధం.. వీడియో కాల్‌లో ఆంటీని చూపించమన్న మోహన్ మాటలు గుర్తొచ్చినా.. మనస్కరించక బైటికి నడిచాను.

అతికష్టం మీద అంకుల్‌కి నచ్చచెప్పడం, మోహన్‌తో మాట్లాడటం, వాడు తన చెల్లెలితో మాట్లాడటం, హాస్పిటల్ వ్యవహారాలు త్వరగా పూర్తిచేసి.. లక్ష్మి ఆంటీ మృతదేహంతో రాత్రి పది గంటల సమయంలో ఔటర్ రింగ్‌రోడ్ దగ్గర్లో ఉన్న వాళ్ల విల్లాకి చేరుకున్నాం.

అప్పటికే రేవతి పదిపన్నెండు సార్లు ఫోన్ చేసింది. జరిగింది క్లుప్తంగా చెప్పి, మరో గంటలో ఇంటికి చేరతానని చెప్పాను. పొద్దుటినుంచి తిండీ నీళ్లు లేకపోవడం, హాస్పిటల్ వాతావరణం, ఫోన్ల ద్వారా నిర్ణయాలు, క్షణం తీరిక లేకుండా ఇతర ఏర్పాట్లు చూడటంతో కళ్లు తిరుగుతున్నట్టుగా ఉంది.

పనివాళ్ల సాయంతో హాల్‌లోకి ఫ్రీజర్ బాక్స్ చేరింది. నిర్జీవమైన ఆంటీముఖాన్ని చూడటానికి ధైర్యం లేదు.

సుందర్రావుగారు నిస్తేజంగా ఉన్నారు.